# చిత్రశాల

# విచిత్రాలు

"మహేశ్వర్"

న్యూ బాంబే థియేటర్సులో ఓనాటి షూటింగ్ దృశ్యం ఈక్రింద చిత్రిస్తాను.

వాళ్ళ కథపేరేమిటో తెలీదు కాని కథని మాత్రం కాస్త సూక్ష్మీకరిస్తున్నాను.

మామూలుగా అన్ని తెల్గు ఫిల్ముల్లో మాదిరిగా ఈ ఫిల్ముకీ రెండుజోడీలు:

ఒకటి; ముసలిహీరో—పడుచుపెళ్ళాం.

రెండూ: యవ్వనమిధునం.

ఈ కథలో ముసలిహీరో పెళ్ళాం పడుచుహీరోతో రొమాన్సు సాగిస్తుంది.

ముసలిహీరో పడుచుహీరో పెళ్ళాణ్ణి చెరపబోతాడు—

ముసలిహీరో సదరు హీరో భార్యా పరమపదిస్తారు—: అంతే—!

ముసలిహీరోకీ, అతని భార్య పడుచు హీరోయిన్‌కీ సంభాషణ :

ముసలిహీరో:—మందస్మిత సుందర వదనారవింద రమణీ—! ఏ జన్మలో పెట్టిపుట్టేనో నువ్వు లభ్యమయ్యేవ్—నాహృదయం నీకోసం ఎంత ఆరాటపడుతోందో గమనించవ్‌కదా! యవ్వనోద్రేకంలో ఉన్న స్త్రీ—ఇలా మొగాడికి, అందులోనూ చేసుకున్న మొగుడికి దూరంగా ఉండటం శోచనీయం కాదూ??

హీరోయిన్ :—చాలు కవిత్వం : అరవై ఏళ్ళు నెత్తికొచ్చి ప్రేమ పేలాపాలు ! ఇలాఐతే నే ఇంట్లోఉండను.

హీరో :—పోనీ స్వర్గంలోకెత్తుకుపో—

హీరోయిన్ :—అక్కడకూడా నువ్ తప్పవ్ కాబోలు !

హీరో :—శరీరానికి వార్ధక్యం—యవ్వనం ఉన్నాయ్ గాని 'ప్రేమ'కు కూడా వయస్సు వార్ధక్యం లేవుకద—ఒక్కసారి నీ అధరాలని అందిస్తే చవిచూచి........:

[అని మీదపడబోతాడు. హీరోయిన్ ఒక్కతాపు తంతుంది. దాంతో మూడుదొర్లులు దొర్లి కిందపడుతాడు. లేచి దుల్పుకుని డైరక్టరువైపు చూస్తాడు]

డైరక్టరు :—ప్రణయఘట్టం మహబాగా నడిచింది కాని కథలో హీరోయిన్ మాటల్తో బతిమాలుకుంటే లొంగుతుందా? పాటల్తో బతిమాలుకోవాలి. ఏదీ ఆ 'ఖజాంచీ'లో "లావ్‌ఢ్ గయీయా...." స్టయిల్లో ఓపాట బనాయించండి.

కవి :—చిత్తం....అదెంత పన్లెండి!

(పాట) హా....ప్రియా....నా అ అ మ ది ఇ....వెతబడి గుండెలు ఉ....మండెనె ఎ ఎ....!హా....ప్రియా!

డైరక్టరు :—ఫైన్—ఫైన్—ఇదిగో హీరోజీ మీరీ పాటలో హీరోయిన్‌ని వేడుకోవాలి.

హీరో :—నాకు పాట రాదండి.

డైరక్టరు :—ఐతే నువు హీరోవి కావు—

(హీరో చివరకాపాటపాడి తొంభై పుంజీల "కట్—"లు తిని హీరో అనిపించుకుంటాడు)

• • •

తరువాత దృశ్యం :

ముసలిహీరో పెళ్లాంకి పడుచు హీరోకి రొమాన్సు :

హీరోయిన్ :—అబ్బ! మీదర్శన భాగ్యానికే ఇంత సంతృప్తినొందిన నామనస్సు—మిమ్మల్ని పూర్తిగా వశంచేసుకుంటే నా మనస్సు మనస్సులో ఉండదేమో—

హీరో :—నామీద మీకున్న ఆదరణ అపారం. మీవంటి దయార్ద్ర హృదయులు నాకింతవరకూ కనబడలేదు.

హీరోయిన్ :—(హీరోమీద పడబోతుంది)

హీరో :—నాన్‌సెన్స్—నువ్వా చేట మొహంమీద పడ్డావంటే భరించలేను—

డైరక్టరు :—కట్—కట్ హీరోగారూ and హీరోయిన్‌గారూ, మీరిద్దరూ వయస్సులో ఉన్నారు—గొప్పరొమాన్సు నడిపించాల్సిన సీను ఇలా తగలేస్తే....?

హీరో :—నేనీవిణ్ణి కౌగలించుకోలేనండి—నాకదేవిటో అసహ్యంగా ఉంది,

(హీరోన్ సిగ్గుతో లోనికిపోతుంది)

* * *

[ముసలిహీరోకీ పడుచు హీరో భార్య పతివ్రతకీ రొమాన్సు]

ముసలిహీరో :—దా అమ్మాదా—ప్రభాతకన్యలా ఉన్నావ్—పొద్దున్నే ఇలా వచ్చేవేం?

పతివ్రత :—మీ ఆవిడ కవిల్లో కాస్తానన్నారు—ఒస్తారేమో అని—

హీరో :—ఒస్తుందమ్మా—ఒస్తుంది—మా ఆవిడ కన్నసున్నితమైన గొంతు నీది. కోయిలస్వరంకన్న కమ్మగా, వినసొంపుగా, ఉంది—అలా నిలబడిపొయ్యేవేం? కూర్చో—స్నానానికెళ్ళింది—ఇప్పుడే ఒస్తుంది—

[పతివ్రత కూర్చుంటుంది—హీరో దగ్గరగా వస్తాడు—పతివ్రత జరుగుతుంది.]

పతివ్రత :—తాతగారూ—మీరేదో మర్యాదస్థులనొస్తే ఇలా ప్రవర్తించడం....?

హీరో :—ఏం నా ప్రవర్తనలో ఏందోషం కనబడింది—నీకళ్ళకి తాతనైపోయేనూ—

రాలుగాయితనం ఎక్కువైందే—

పతివ్రత :—మీ ఆవిడ కళ్ళకి మన్మధుడిలా ఉన్నావ్ కాబోలు—అందుకే రోజూ క్లబ్బుల్లని షికార్లని—పోతుంది.

హీరో :—నువ్విప్పుడు కోవిల్లని, గోపురాలని తిరగడంలే?

పతివ్రత :—నీబుర్రతిరుగుంతోది—[పడాల్మని ఓ లెంపకాయ కొడ్తుంది—దాంతో హీరో పడిపోతాడు—లేచి దులుపుకుని డైరక్టరువైపు చూస్తాడు]

డైరక్టరు :—వెల్‌డన్—; (కవివైపు తిరిగి) కవిగారూ ఇక్కడో ట్రాజడిచేయించాలి—

కవి :—చేయించండి—

డై :—ఈ ఇద్దర్లోనూ ఒకాళ్ళను చంపెయ్యాలి.

కవి :—క్లైమాక్సుకు రీచవనీయండి—

డై :—పెద్దకవి! కథకుడివి— ఆమాత్రం క్లైమాక్సుకు రీచ్చేయించలేవ్?

కవి :—చిత్తం—ముసలి హీరో భార్యచేత Suicide commit చేయించండి—ఆమె ప్రాణత్యాగంచూసి ముసలి హీరోని కూడ ఆమెని అనుసరించనీండి. యవ్వన మిధునాన్ని సుఖింపచేయించండి—

డైరక్టరు ;—అది గదీ—మహబాగా తిప్పేరు కథని—

[ఆ దెబ్బతిన్న ముసలిహీరో లోపలకెళ్ళి గుండెబాదుకుంటాడు. పతివ్రతకూడ లోనికి పరుగెడుతుంది]

హీరో :—త్రిలోకసుందరీ; నాగుండెలు బద్దలుచేసేవ్—ఏం సాహసం—(అని మీదపడి ఏడుస్తూంటాడు)

డై :—హీరోగారూ, ఇప్పుడు మీ హార్టాగి పోతుంది.

హీరో :—అప్పుడే ?

డై :—ఊఁ....! టెంపో—చక్—చక్—మనాలి గుండెలు ఆగి నువ్వుమరణితెస్తావ్—చక్కగా అభినయించాలి—రెడీ!....

కవి: —అలా కాదు—హీరోయిన్ విషపూరిత అధరాలని ముద్దుపెట్టుకోడంవల్ల హీరో మరణిస్తే చాలా బావుంటుంది!

డై :—మాంచి సజెషన్—అదీ ఒరిజినాల్టీ అంటే ఈ ఫిల్ముకి బాక్సాఫీసు హిట్—బాలట్‌లో ఫష్ట్!!

(ముసలి హీరో హీరోయిన్ పెదవులు ముద్దెట్టుకుంటాడు. హీరోయిన్ ఫడాల్మనిపిస్తుంది)

డై :—కట్—కట్—హీరోయిన్‌గారూ మీరు ఆత్మహత్యచేసుకున్నారు. చచ్చినట్టు పడుక్కోండి.

హీరోయిన్ :—ఓ దర్మకాగ్రణీ, ఈయనగారి నోరు గంజాయ్ కంపు కొడ్తోంది—

డై :—ఓ తారామణీ—అలాంటివన్నీ ఓ క్షణం తమాయించుకోవాలి. అంతా పపోయింది—ఇంక ఐదు నిముషాలు!

Re-takes తో కూడ పూర్తయింది.